

నాగరాజును అభినందిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

## జిల్లా యూత్ అధ్యక్షుడిగా నాగరాజు

వర్గల్, అక్టోబర్ 28 : బీఆర్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడిగా వర్గల్ మండల కేంద్రానికి చెందిన దేవగనిక నాగరాజును నియమిస్తూ ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశాలు జారీ చేసినట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం గజ్వేల్ పట్టణం సీఎం క్యాంపు కార్యాలయంలో నాగరాజుకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం నాగరాజు చేసిన సేవలను అధిష్ఠానం గుర్తించి జిల్లా యూత్ అధ్యక్షుడిగా నియమించిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు మక్యాల సంతోషావెంకటేశం, వైస్ ఎంపీపీ బాల్‌బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాతాశిశు దవాఖానలో వైద్య సేవలు ప్రారంభం

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 28 : సీఎం కేసీఆర్ చొరవతో గజ్వేల్ పట్టణంలో రూ.32 కోట్లతో నిర్మించిన మాతాశిశు దవాఖానలో శనివారం నుంచి వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. ఇటీవల ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ దవాఖానలో వైద్యారోగ్యశాఖ అనుమతితో వైద్య సేవలు ప్రారంభించారు. ఇమ్యునైజేషన్ ఇన్‌చార్జ్ వాసుదేవ్ ఆధ్వర్యంలో నర్సులు చిన్నారులకు వివిధ రకాల టీకాలు వేశారు. ఆదివారం నుంచి పూర్తిస్థాయిలో గర్భిణులు, నవజాత శిశువులు, చిన్నారులకు వైద్య సేవలు అందించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## బీజేపీ నాయకులపై ఫిర్యాదు

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 28 : తమ పార్టీపై అసత్య ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులపై శనివారం బీఆర్ఎస్ నాయకులు భూంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, మిరుదొడ్డి మాజీ ఎంపీపీ పంజాల కవితశ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డిపై సోషల్ మీడియాలో బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. అసత్య ప్రచారాలు చేస్తున్న బీజేపీ నాయకులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సై భువనేశ్వర్‌రావును కోరినట్లు తెలిపారు. పీఎస్‌లో ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ర్యాకం శ్రీరాములు, చిట్టాపూర్ సర్పంచ్ పోతనక రాజు, వీరారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బాలకృష్ణ, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడి కారు దగ్ధం

దుబ్బాక, అక్టోబర్ 28 : మండలంలోని గోసాన్‌పల్లిలో శుక్రవారం అర్ధరాత్రి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు హరిబాబు కారుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ దుబ్బాక మండల పరిశీలకుడు ఎల్లు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీనారాగౌడ్, సర్పంచులు జనార్దన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గ్రామానికి వెళ్లి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ విషయంపై దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు.



దుబ్బాక టౌన్ : దుబ్బాకలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు



దుబ్బాక టౌన్ : కారు గుర్తుకు ఓటు వేయాలని మహిళను అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటేయండి

- అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి
- దుబ్బాకలో గులాబీ జెండా ఎగురవేద్దాం
- జోరుగా బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

దుబ్బాక టౌన్, అక్టోబర్ 28 : సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్లలో చేసిన అభివృద్ధి కండ్ల ముందే కనబడుతున్నదని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని బీఆర్ఎస్ శ్రేణులు ఓటర్లను అభ్యర్థించారు. శనివారం దుబ్బాక పట్టణంలో రెండోరోజు బీఆర్ఎస్ నాయకులు జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను పలకరించి కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కృతజ్ఞతగా ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, రాష్ట్ర నాయకుడు రొట్టె రాజమౌళి, మున్సిపల్ శాఖ ఎన్నికల ఇన్‌చార్జి గుండు భూపేశ్, పట్టణ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణ, కౌన్సిలర్లు యాదగిరి, స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. హిందు, ముస్లిం, క్రైస్తవ మతాల్లోని పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతిపక్ష నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మరోసారి మోసపూరిత వాగ్దానాలతో వస్తున్నారని, వారిని ఎట్టిపరిస్థితుల్లో నమ్మొద్దని కోరారు. కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే దుబ్బాక అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, ఎంపీగా పదేండ్లు ప్రజలకు సేవ చేసిన అనుభవం ఆయనకు ఉందని వివరించారు. ప్రభాకర్‌రెడ్డిని గెలిపించుకుంటే వచ్చే ఐదేండ్లలో కనీవినీ ఎరుగని అభివృద్ధి జరుగుతుందన్నారు. అభివృద్ధిలో వెనుకబడ్డ దుబ్బాకను ప్రభాకర్‌రెడ్డి గెలుపుతో రెట్టింపు అభివృద్ధి చేసుకుందామని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో సీనియర్ నాయకులు వడ్లకొండ శ్రీధర్, భూంరెడ్డి, బట్టు ఎల్లం, బండి రాజు, చాడ భాను, శ్రీరాం రవీందర్, పల్లె రామస్వామిగౌడ్, గుండబోయిన వెంకటేశ్వర్, పెంటం రాంచంద్రం, నాయకులు ఆకుల దేవేందర్, రాజిరెడ్డి, భూపాల్, చంద్రమౌళి, తుమ్మ శంకర్, రాంరెడ్డి, ఆంజనేయులు, భగవాన్, మల్లేశం, అంబిక రాజు, పడాల నరేశ్, సురేశ్, రాజశేఖర్, ఆసిఫ్, ఖలీల్, రాజు, రమేశ్, రాజు, బోసు, లొంక లచ్చయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు జైకొట్టిన కూడవెల్లి ముదిరాజ్‌లు

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 28 : అక్బర్‌పేట-భూంపల్లి మండలం కూడవెల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ కుల సంఘం సభ్యులు శనివారం గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కుల సంఘం సభ్యులందరూ వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓట్లు వేసి బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కూడవెల్లి సర్పంచ్ సుగుణానర్సింహులు, బీఆర్ఎస్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు పంజాల శ్రీనివాస్‌గౌడ్, బోయ శ్రీనివాస్, ధర్మారం బుచ్చయ్య, డాక్టర్ కృష్ణ, లింగాల వెంకటేశ్‌రెడ్డి, ర్యాకం శ్రీరాములు, యువత విభాగం నియోజకవర్గం ఇన్‌చార్జి పాపని సురేశ్‌గౌడ్, నాయకులు బాలకృష్ణ, మురళి, బండారు స్వామి, కడవెర్గు కృష్ణమూర్తి, ముదిరాజ్ కుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి : కూడవెల్లి గ్రామంలో బీఆర్ఎస్‌కే ఓట్లు వేస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసి మద్దతు ప్రకటించిన ముదిరాజ్ కులస్తులు

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 28 : తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం కొండపాక మండలం సిరిసినగండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్‌రెడ్డి హాజరైన మాట్లాడారు. సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు ఇప్పటికే మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫామ్స్ వంటి సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహారం ప్రవేశపెట్టిందన్నారు. ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులపై తల్లిదండ్రుల ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులను సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలన్నారు. పేరెంట్స్ సమావేశానికి తల్లిదండ్రులు తప్పక హాజరుకావాలన్నారు. సమావేశంలో ఎంఈవో ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు పెద్ది విఠల్, ఎస్ఎంసీ చైర్మన్ కనకయ్య, టీచర్లు పాల్గొన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకోవాలి



సిద్దిపేట రూరల్ : రాఘవాపూర్‌లో కవాతు చేస్తున్న పోలీసులు

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 28 : ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏసీపీ సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్, తోర్నాలతో పాటు నారాయణరావుపేట్ మండల కేంద్రంలో పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు శాంతియుతంగా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు తప్పక ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వేసే విషయంలో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని లేదా పోలీస్‌కంట్రోల్‌రూం 812667100 లేదా డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.పోలింగ్ జరిగే రోజు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. గ్రామాల్లో ఏ పార్టీ వారు వచ్చి ప్రచారం చేసినా అడ్డుకోరాదని,ఒక వేళ అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పారామిలటరీతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీ-విజిల్ యాప్ వినియోగాన్ని ఆయాగ్రామాల్లో ప్రజలకు వివరించారు. ఎవరైనా ఈయాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సిద్దిపేట రూరల్ సీఐ చేరాలు, సిద్దిపేట రూరల్ ఎస్సై కిరణ్‌రెడ్డి, కేంద్ర బలగాలు, అధికారులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

### కొండపాకలో..

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 28 : ప్రశాంత వాతావరణంలో ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని గజ్వేల్ ఏసీపీ రమేశ్ సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్‌లో ఏసీపీ రమేశ్, తొగుట సీఐ కమలాకర్, కేంద్ర బలగాల అధికారులు, సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఓటు వేసే విషయంలో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదంటే 100కు కాల్ చేయాలని సూచించారు. మద్యానికి, డబ్బులకు ఓటును అమ్ముకోవద్దని నచ్చిన వ్యక్తికి నిజాయితీగా ఓటు వేయాలని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన సీ-విజిల్ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్న వీడియా, ఫొటోలను యాప్‌లో అప్లోడ్ చేస్తే వెంటనే సంబంధిత అధికారులు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్, కేంద్ర బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.



కొండపాక : చిన్నకిష్టాపూర్‌లో కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ఏసీపీ రమేశ్ తదితరులు